క్లుప్తంగా

అన్నదానానికి రూ.25వేలు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామానికి చెందిన తునికిపాటి రామారావు జ్ఞాపకార్థం రామ్మోహన్ కుటుంబసభ్యులు రూ.25,116 విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ఘనంగా లక్షతులసి పూజ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి యున్న శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్వామివారికి లక్షతులసి పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈపూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణవ్రతం




నందిగామ: పట్టణంలోని మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. కార్తీకమాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. అనంతరం ఆలయంలోని శివలింగానికి పంచామృత అభిషేకాలు, బిల్వార్చన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో నిర్వహించిన సామూహిక సత్యనారాయణస్వామి వ్రతానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

విద్యార్థులకు ఫ్యాషన్ డిజైన్ పోటీలు



కంచికచర్ల: స్థానిక ఇమ్మాక్యులేటివ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్యాషన్ డిజైన్, వెజిటబుల్ కార్విన్, మొహందీ తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీరులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య విద్యార్థులను చదువుతో పాటు సాంస్కృతిక, కళారంగాల్లో రాణించేందుకు కళాశాల విశేషంగా కృషిచేస్తోందని నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఆయా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మరిషేన్, సిస్టర్ రాజమణి, విజయరాణి హైస్కూల్ హెచ్ఎం సిస్టర్ క్రీస్తురాణి, సుపీరియర్ సిస్టర్ వర్జిల్‌మేరీ, రామావత్ కోటి, లక్ష్మి పాల్గొన్నారు.

ఖో-ఖో పోటీల్లో 'మిక్' విద్యార్థుల ప్రతిభ



కంచికచర్ల : తమ కళాశాలలో ఇంజినీరింగ్ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యనందించడంతోపాటు క్రీడల్లో మెరుగైన శిక్షణ ఇస్తున్నామని మిక్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ తెలిపారు. నరసరావుపేటలో జరిగిన జేఎన్‌టీయూ(కె) సెంట్రల్ జోన్ ఖో-ఖో పోటీల్లో ద్వితీయబహుమతిని సాధించిన మిక్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులను శుక్రవారం ఆయన అభినందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన పలుపోటీల్లోనూ తమ విద్యార్థులు బహుమతులు సాధిస్తున్నారని తెలిపారు. ఖోఖో విజేతలను అభినందించినవారిలో కళాశాల సీఈఓ ప్రొఫెసర్ డి.పాండురంగారావు, యాజమాన్య కమిటీ సభ్యులు ఎం.సుహాస్, ఫిజికల్ డైరెక్టర్ నిమ్మగడ్డ శౌరయ్య, అదనపు పీడీలో ఎస్.సురేష్, వెంకటరమణ, ఆయా విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

పంట పొలాల పరిశీలన

వీరులపాడు: తుపాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి పంటనష్టం అంచనాలు తయారు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి జోగేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని పెద్దాపురం, జుజ్జూరు గ్రామాల్లో తుపాను కారణంగా దెబ్బతిన్న మొక్కజొన్న పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్ట వివరాలను నమోదు చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు వివరించారు. సర్పంచ్‌లు రమావత్ కోటి, నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

ప్రభుత్వ విప్ ఉదయభాను



నర్సింగ్ కళాశాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన వైద్యరంగ చరిత్రలోనే సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. స్థానిక కోదాడరోడ్‌లో వాగ్దేవి మహిళా కళాశాల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాగ్దేవి బీఎస్సీ నర్సింగ్ కళాశాలను విప్ ఉదయభాను, వైఎస్సార్‌సీపీ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ పారిశ్రామికవాడగా రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న జగ్గయ్యపేట ప్రాంతంలో నర్సింగ్ కళాశాలను ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు గతంలో బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేయాలంటే విజయవాడ, గుంటూరు వంటి నగరాలకు వెళ్లాల్సివస్తూ ఇబ్బందిపడేవారన్నారు. కానీ నేడు జగ్గయ్యపేటలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుచేయడం ఈప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందని వివరించారు. ఆధునిక వసతులతో ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ యువనాయకుడు సామినేని ప్రశాంత్‌బాబు, ప్రముఖ వైద్యులు వరప్రసాదరావు, విశ్వేశ్వరరావు, ఎండీ నాగేశ్వరరావు, పాపారావు, ప్రభుత్వాస్పత్రి సూపరిండింటెండెంట్ హరీష్, ఆయా విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులు నరసింహారావు, రంగాపురం నరసింహారావు, పెనుగొండ రాజీవ్, అబ్బులు, రమేష్, తిరుపతిరావు, నర్సింగ్ కళాశాల ప్రతినిధులు బుస్సా సురేష్, సరిత, డైరెక్టర్లు ఎస్‌వీ.నరసింహారావు, కె.సత్యనారాయణరావు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు..ఆదుకుంటాం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పరిటాలలో దెబ్బతిన్న పత్తిచేనును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పరిటాల(కంచికచర్ల): తుపాను కారణంగా పంటలను నష్టపోయిన రైతులెవ్వరూ అధైర్యపడొద్దని, బాధిత రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని పరిటాల శివారులో తుపాను కారణంతో దెబ్బతిన్న పంట చేలను శుక్రవారం ఆయన పరిశీలించారు. మోకాలిలోతు వరదనీటిని సైతం లెక్కచేయకుండా పంట పొలాల్లో దిగి పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి అధైర్యపడవద్దని సూచించారు. ప్రభుత్వం నుంచి తప్పకుండా నష్టపరిహారం అందుతుందని రైతులకు ధైర్యం చెప్పారు. పొలాల్లో ఉన్న వర్షపునీటిని నీటిని బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం..

ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ తుపాను కారణంగా తడిసిన వరిధాన్యం, పత్తిని ఆరబెట్టుకోవాలని రైతులకు సూచించారు. పంటల సంరక్షణకు వ్యవసాయ అధికారుల సూచనలను పాటించాలన్నారు. తడిచిన, రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. తుపాను దెబ్బకు వాణిజ్య పంటలతోపాటు ఉద్యానపంటలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చూడాల్సిన ఉందన్నారు. దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించి, పంట నష్టం అంచనాను ఖచ్చితత్వంతో పూర్తిచేసి ఉన్నతాధికారులకు అందజేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్, సొసైటీ అధ్యక్షుడు మాగంటి వినయభూషణరావు, నాయకులు చింతా రవీంద్రనాథ్, వేల్పుల రమేష్, మార్త శ్రీనివాసరావు, శేషయ్య, వేముల నాగరాజు, రైతులు ఉన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పాలన



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. నందిగామ పట్టణంలోని 18వ వార్డులో శుక్రవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన సంక్షేమ క్యాలెండర్‌ను వార్డుప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా పారిశ్రామికవేత్తలకు కొమ్ముకాయకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బండారు గంగమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వార్డు కన్వీనర్ బండారు వెంకట్రావ్, నాయకులు బాపట్ల సాంబయ్య, విజయ, పట్టా శ్రీను, బండారు శేషు, మున్సిపల్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

పేట అభివృద్ధికి కృషి



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ప్రధాన ద్వారం వద్ద రూ.12లక్షలతో ఏర్పాటు చేయనున్న వాటర్ ఫౌంటెయిన్ నిర్మాణ పనులకు శుక్రవారం వారు శంఖుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కృషితో పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కమిషనర్ నాగమల్లేశ్వరరావు, కౌన్సిలర్లు పందుల రోశయ్య, దువ్వల రామకృష్ణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబు పాల్గొన్నారు.

నేడు మాలల ఆత్మీయ సమ్మేళనం

నందిగామ: కంచికచర్లలో శనివారం మాలల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యుడు పిల్లి జయరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంచికచర్లలోని చైతన్య స్కూల్ ఎదురుగా ఉన్న గ్రౌండ్స్‌లో సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే ఈ సమ్మేళనానికి విద్యార్థులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

పేదల సొంతింటి కల సాకారం



గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరైన విప్ ఉదయభాను, నాయకులు

వత్సవాయి(పెనుగంచిప్రోలు): పేదల సొంత ఇంటి కలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. మండలకేంద్రం వత్సవాయిలోని జగనన్నకాలనీలో ఎంపీటీసీ సభ్యురాలు మెట్టికోలు అనురాధ, నరేష్ దంపతుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ దేశచరిత్రలోనే 33 లక్షల మందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసిన ఘనత ఒక్క సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు మరింత వేగం పుంజుకోవాలన్నారు. కాలనీల్లో అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.రమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు ఏనుపోగు దేవమణి, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు గాదెల రామారావు, భూక్యా రాజా, పరమయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

ఎమ్మెల్సీ అరుణకుమార్



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: చట్టసభల స్థానాల్లో సింహభాగం బడుగు, బలహీన వర్గాలకే దక్కేలా అవకాశం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. శాసనమండలి సభ్యునిగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆయన కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో గురుతర బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. తాను ఎమ్మెల్సీగా, తన సోదరుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు నందిగామ శాసనసభ్యునిగా ఉన్నామంటే నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో పాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారం వల్లనేనని చెప్పారు. ప్రజాసేవ చేసే భాగ్యాన్ని తమకు కల్పించిన ప్రజలకు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. నందిగామ నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి మరింత కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, గద్దె రమేష్, పుల్లారావు, నాదెండ్ల నరేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటినుంచి గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం తోటరావులపాడులో గడపగడపకు మనప్రభుత్వం నిధులు రూ.20లక్షలతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడంతోపాటు సత్వరమే పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఒక్కో సచివాలయానికి రూ.20లక్షల నిధులు మంజూరు చేయడంతో ఈ నిధులతో డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ ములకలపల్లి లక్ష్మి, నాయకులు కృష్ణమోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అందరికీ మేలు



కంచికచర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



జగ్గయ్యపేటలో మాట్లాడుతున్న మున్సిపల్‌చైర్మన్ ఆర్. రాఘవేంద్ర



షేర్‌మహ్మద్‌పేటలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎస్.వెంకటకృష్ణప్రసాద్

కంచికచర్ల : రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయాలని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ప్రజలకు పిలుపునిచ్చారు. కంచికచర్ల గ్రామసచివాలయం-3 పరిధిలో శుక్రవారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును, సంక్షేమ పథకాలతో ప్రజలకు చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. వార్డు, గ్రామ సచివాలయాలను సందర్శించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి వివరాలతో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ నాయకులు కల్లబొల్లి మాటలు చెబుతారని, వాటిని నమ్మవద్దని సూచించారు. నాలుగున్నర ఏళ్లలో గ్రామ సచివాలయం-3 పరిధిలోని అన్ని వర్గాల ప్రజలకు డీబీటీ ద్వారా రూ.4.69కోట్ల నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జగనన్న ప్రభుత్వం జమచేసిందని వివరించారు. అర్హతే ప్రామాణికంగా సీఎం జగనన్న అవినీతిరహిత పాలన అందిస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలన్నారు. అదేవిధంగా తనను ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, కంచికచర్ల, బత్తినపాడు సర్పంచులు వేల్పుల ప్రశాంతి, జంగా సంతోషరావు, ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల మధుబాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ మాడుగుల శంకర్, నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, ఎం.పాండురంగారావు, మార్త శ్రీనివాసరావు, యాదాల రాంబాబు, జంగా తిరుమల బేబి, మండల పరిషత్ సూపరిండెంటెంట్ బాల శంకరరావు, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి పాల్గొన్నారు.

రెండు వార్డుల ప్రజలకు రూ.18.92కోట్ల లబ్ధి

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 12వ సచివాలయం పరిధిలో ఉన్న 25, 26వ వార్డుల ప్రజలకు జగనన్న నాలుగున్నరేళ్ల పాలనలో రూ.18.92కోట్ల మేర లబ్ధి చేకూరిందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలోని 12వ సచివాలయం పరిధి(25,26 వార్డులు)నకాశిబజారులోని కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ఆయా వార్డు ప్రజలకు జరిగిన లబ్ధి వివరాలతో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డులను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉదయభాను కృషితో జగ్గయ్యపేట అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగనన్న నాలుగున్నరేళ్ల పాలన, గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా సాగించిన పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమానికి పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర అధ్యక్షత వహించగా, కౌన్సిలర్ పాకలపాటి సుందరమ్మ, మాజీ కౌన్సిలర్ గెంటేల భాగ్యలక్ష్మి, పార్టీ మహిళ, ఎస్టీ, కార్మిక విభాగాల అధ్యక్షులు ముసిని రాజ్యలక్ష్మి, బద్దునాయక్, గోగుల వెంకయ్య, పెనుగంచిప్రోలు సచివాలయాల కన్వీనర్ శామ్యూల్, నాయకులు పూసల పుల్లారావు, భాస్కరరావు, డేవిడ్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

షేర్‌మహ్మద్‌పేటలో

చరిత్ర ఎరుగని విప్లవాత్మకమైన పాలనను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. షేర్‌మహ్మద్‌పేట పంచాయతీ కార్యాలయం వద్ద 'వైఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నాలుగున్నరేళ్లలో అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పేట నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే ఉదయభాను మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. గ్రామపార్టీ అధ్యక్షుడు సతీష్‌శర్మ, మండల సచివాలయాల కన్వీనర్ షాబుద్దీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐ రామారావు సేవలు స్ఫూర్తిదాయకం



ఎస్ఐ రామారావు దంపతులను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, పోలీసు అధికారులు

జగ్గయ్యపేట అర్బన్: పేట పట్టణ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై విజయవాడ స్పెషల్ బ్రాంచికి వెళ్తున్న బీవీ రామారావు సేవలు స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కొనియాడారు. స్థానిక ఉక్కు కళావేదికలో పట్టణ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఎస్ఐ రామారావుకు శుక్రవారం రాత్రి ఆత్మీయ సన్మాన సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ ఎస్ఐ రామారావు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి వివాదరహితుడిగా పేరుతెచ్చుకున్నారన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించడంలో తనదైన శైలిలో వ్యవహరిస్తూ పట్టణ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారన్నారు. ఎస్ఐ రామారావు భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎస్ఐ రామారావు దంపతులను ఉదయభానుతోపాటు, నందిగామ ఏసీపీ జనార్దన్‌నాయుడు, సీఐ జానకీరామ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకులశ్రీకాంత్, నూతన ఎస్ఐ ఆనందకుమార్, పోలీస్ సిబ్బంది కలిసి ఘనంగా సత్కరించారు.



వత్సవాయి మండలం వేమవరంలో నీటిలో నుంచి పైకి లేపి దుబ్బు కట్టిన వరికంకులు



పెనుగంచిప్రోలు మునేరు అవతల ధాన్యం ఆరబోస్తున్న రైతులు

తగ్గుముఖం పట్టిన వరద

పెనుగంచిప్రోలు: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా రెండురోజులుగా కొనసాగుతున్న వరద ఉధృతి శుక్రవారం కాస్త తగ్గుముఖం పట్టింది. భారీవర్షాలకు వాగులు పొంగి పొలాలు ముంపునకు గురికాగా, వరిపొలాల్లో వరదనీరు ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పట్టడంతో పొలాల్లోనే వర్షపు నీటిని రైతులు బయటికి పంపించేందుకు అగచాట్లు పడుతున్నారు. పొలాల వెంబడి కాల్వలు తీసి నీటిని బయటికి పంపిస్తున్నారు. రైతులు నీటిలో మునిగిన వరికంకులను పైకిలేపి తిరిగి కింద పడకుండా నాలుగైదు వరిదుబ్బులను కలిపి తాళ్లు కడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని రైతులు పట్టాలపై ఆరబోసుకుంటున్నారు. పొలాల్లో నిలిచి ఉన్న నీరంతా బయటికి వెళ్తే పంటనష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసేందుకు వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది సమాయత్తమవుతున్నారు.

సౌత్‌జోన్ వాలీబాల్ టోర్నీకి పవన్ ఎంపిక



వాలీబాల్ టోర్నీకి ఎంపికైన పవన్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

జూపూడి(ఇబ్రహీంపట్నం): సౌత్‌జోన్ అంతర్ యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌కు జూపూడి నిమ్రా నర్సింగ్ కళాశాల విద్యార్థి వి.పవన్ ఎంపికయ్యాడు. గత నెల 29న విజయవాడ డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పవన్‌ను ఎంపిక చేసినట్లు శుక్రవారం ఆదేశాలు అందినట్లు కళాశాల అకడమిక్ డైరెక్టర్ నారాయణమూర్తి తెలిపారు. ఈ నెల 22నుంచి 25వ తేదీ వరకు బెంగళూరు విశ్వేశ్వరయ్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారన్నారు. పవన్‌ను కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, రీసెర్చ్ అకడమిక్ డైరెక్టర్ బాబులాల్, పీడీ సత్తార్‌ఖాన్ అభినందించారు.